క్లుప్తంగా

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు


మట్టి అక్రమ తవ్వకాల ప్రదేశంలో జేసీబీ

రేణిగుంట: రేణిగుంట మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మండలంలోని స్వర్ణముఖి నదిలో రాత్రి సమయంలో జోరుగా మట్టి తవ్వకాలు చేస్తూ టిప్పర్లలో తరలిస్తున్నారు. పగటిపూట అక్కడే జేసీబీలను ఉంచుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏ చర్యలూ తీసుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది.

మోటార్లు, స్టార్టర్ల చోరీ
- లబోదిబోమంటున్న రైతులు



ఏర్పేడు: మండలంలోని చెల్లూరు, కుమ్మరికండ్రిగ, గుండ్లకండ్రిగ గ్రామాల పొలాల్లోని విద్యుత్ మోటారు స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీ చేశారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. రైతులకు చెందిన 30 మోటారు స్టార్టర్లు, 40 కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. తరచూ మండలంలో దొంగలముఠా వ్యవసాయ మోటారు, స్టార్టర్లు చోరీ చేసి, వాటిని తిరుపతి, చెన్నై తదితర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటోందని తెలుస్తోంది. వరుస చోరీలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పోలీసులు దొంగల భరతం పట్టాలని కోరుతున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఏర్పేడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఓపీ సేవలు, ఆస్పత్రిలో చేస్తున్న కాన్పులు, శస్త్రచికిత్సలు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ డేటా గురించి ఆరా తీశారు. ఎండల దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని ఆదేశించారు. వైద్యాధికారిణి డాక్టర్ శివప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

దేశరక్షణలో సైన్యం త్యాగాలు వెలకట్టలేనివి


జాతీయ జెండాలతో తిరంగ యాత్ర


వరదయ్యపాళెం: దేశ రక్షణలో భారత సైన్యం పాత్ర వెలకట్టలేనివని ఈవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు అన్నారు. భారత సైన్యం పోషిస్తున్న పాత్రను ప్రశంసిస్తూ వారికి మద్దతుగా శుక్రవారం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో స్థానికులతో కలసి జాతీయ జెండాలతో తిరంగ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్‌మాతాకి జై, వందేమాతరం, జైజవాన్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మురళి, ఢిల్లీప్రకాష్, తడ శ్రీను, వెంకటేష్, విజయ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గేట్‌లో సత్తా చాటాడు


పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: ప్రతిష్టాత్మక గేట్–2025 పరీక్షలో శ్రీకాళహస్తికి చెందిన చుక్కల సుబ్బారావు కుమారుడు చుక్కల పవన్ కుమార్ సత్తా చాటాడు. దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యార్థుల మధ్య తీవ్ర పోటీ ఉండే గేట్ పరీక్షలో పవన్ కుమార్ ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఉన్నత విద్యనభ్యసించడానికి, నెలకు రూ.10 వేల చొప్పున జాతీయ ఉపకార వేతనం పొందేందుకు అర్హత సాధించాడు. పవన్ కుమార్ మదనపల్లెలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు.

డేంజర్..డేంజర్!



రేణిగుంట: రేణిగుంట మిరియాల బాబా ఆశ్రమం ఎదురుగా ఉన్న దారిలో కల్వర్టు దెబ్బతింది. వాహనాలు రాకపోకలు, చిన్నపిల్లలు తిరిగే ప్రదేశంలో కల్వర్టు గుంత ఉండడంతో ప్రమాదాలకు తావిచ్చేలా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు కల్వర్టు స్లాబ్‌ను మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వృక్ష సంహారం



పెద్ద చెట్టు కొమ్మలు తరలించడంతో మిగిలిన కలప, గంగ కాలువ గట్టుపై నరికిన చెట్లను ట్రాక్టర్‌కు లోడింగ్

సత్యవేడు: మండలంలోని వానెల్లూరు–రంగనాథపురం గ్రామాల పరిధిలో ఉన్న తెలుగుగంగ కాలువ గట్టుపై పెద్ద పెద్ద వృక్షాలను నరికేస్తున్నారు. పెద్ద పెద్ద చెట్లను నరికి ట్రాక్టర్లలో తరలిస్తున్నా గంగ అధికారులు పట్టించుకోవడం లేదు. గంగ అధికారులు కొందరికి మట్టి తరలిపునకు అనుమతులు ఇస్తుండడంతో జేసీబీలకు అడ్డంగా ఉన్న వృక్షాలను పూర్తిగా తొలగిస్తున్నారు. అధికారులకు కూడా వాటాలు ఉండడంతో చూసీ చూడనట్లు ఉంటున్నారని సమాచారం. ప్రస్తుతం తెలుగు గంగ కాలువ 131 కిలోమీటరు వద్ద గంట కాలువ గట్టు మట్టి తరలించేందుకు 14వేల క్యూబిక్ మీటర్లు పర్మిషన్ కాంట్రాక్టర్లు కోరారు. ప్రస్తుతం 3 వేల క్యూబిక్ మీటర్లకు గంగ అధికారులు పర్మిషన్ ఇచ్చినట్లు చెబుతున్నారు. తమిళనాడుకు మట్టి తరలించే క్రాంట్రాక్టర్లు కాలువ గట్టుపై టిప్పర్లు, జేసీబీలు తిరిగేందుకు అడ్డు లేకుండా పెద్ద పెద్ద చెట్లు తొలగిస్తుండడంతో పశువులకు నీడ లేకుండా పోతోంది.

చెట్లను నరికేస్తున్నారు


జాతీయ రహదారిపై నరికేసిన వృక్షాలు

నారాయణవనం: రోడ్లకు ఇరువైపులా పచ్చదనం పెంపునకు పెంచడానికి ప్రభుత్వాలు కోట్ల రూపాయలను వెచ్చిస్తుంటే, ఏపుగా పెరిగిన భారీ వృక్షాలను, కొమ్మలను విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా కొట్టివేస్తున్నారు. మండలంలోని జాతీయ రహదారి 716–ఎకి ఇరువైపులా రాళ్ల కాలువ నుంచి పాలమంగళం వరకు సుమారు 6 కిలోమీటర్ల దూరం భారీ వృక్షాలు నీడనిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే లారీలు, కంటైనర్లు, భారీ వాహనాలను ఈ చెట్ల కింద ఆపి డ్రైవర్లు సేదతీర్చుకుంటున్నారు. గ్రామాల్లో మెరుగైన విద్యుత్ సరఫరాకు హెచ్‌టీ లైన్లను ఏర్పాటు నిమిత్తం జాతీయ రహదారిపై అరణ్యం కండ్రిగ సబ్ స్టేషన్ నుంచి పాలమంగళం వరకు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు స్తంభాలను నాటారు. లైన్లకు అడ్డంగా ఉన్న భారీ వృక్షాలను తొలగిస్తున్నారు. దీంతో రైతులు, బాటసారులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృక్షాలకు అడ్డు రాకుండా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఫోన్ పే కేటుగాళ్లు..!

- వ్యాపారి ఖాతా నుంచి రూ.లక్ష కొట్టేశాడు
- పట్టణంలో పెరుగుతున్న సైబర్ నేరాలు

శ్రీకాళహస్తి: సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు సరికొత్త మోసాలతో డబ్బులు కొట్టేస్తున్నారు. డిజిటల్ లావాదేవీలు బాగా పెరిగిన నేపథ్యంలో మోసగాళ్లు కూడా ఎప్పటికప్పుడు సరికొత్త పంథాలో డబ్బులు కాజేస్తున్నారు. దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులకు సంబంధించి క్యూఆర్ కోడ్‌లో ఫోన్‌పే యాప్‌తో స్కాన్ చేసినట్లు నటించి ముందుగానే ఫీడ్ చేసుకున్న మెసేజ్ చూపించి, పనిచేయడం లేదంటూ తోపుడుబండ్లు, చిన్నచిన్న బడ్డీకొట్లు వద్ద ఇలా తరచూ మోసాలు చేస్తున్నారు. అయితే చిన్నమొత్తాలు కావడంతో వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. అయితే గురువారం రాత్రి ఓ యువకుడు ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ దుకాణానికి వెళ్లి క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్నట్లు నటించి ఫోన్‌పే కావడం లేదని తాను వేసుకున్న స్కెచ్ ప్రకారం వ్యాపారికి టోకరా వేశాడు. ఫోన్ ఇస్తే చేస్తానంటూ వ్యాపారి ఫోన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాడు. అయినా పనిచేయడం లేదంటూ తాను ఏటీఎంలో డబ్బులు తీసుకువస్తానంటూ సరుకులు అక్కడే పెట్టి వెళ్లిపోయాడు. సీన్ కట్ చేస్తే– అదే రాత్రి దుకాణదారుని ఖాతాలో నుంచి సుమారు రూ.లక్ష డ్రా అయినట్లు మెస్సేజ్ రావడంతో లబోదిబోమంటూ 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమ ఫోన్‌లో క్యూఆర్ కోడ్ సిద్ధం చేసుకుని షాపుల వద్ద తమ క్యూఆర్ కోడ్‌లు పెట్టి వెళ్లిపోయిన ఘటనలు గతంలో వెలుగు చూశాయి. ఇప్పుడు వ్యాపారి సెల్‌ఫోన్‌లోని క్యూఆర్ కోడ్‌తో కాజేయడం చర్చనీయాంశమైంది.

సైబర్ నేరాలపై అప్రమత్తం


సీఐ నాగార్జున రెడ్డి

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సైబర్, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా యువత పనిచేయాలని కోరారు. అలాగే వర్క్ ఫ్రమ్ హోం అంటూ కొందరు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, సీవీవీ నంబర్లు, పాస్‌వర్డ్ ఎవరికీ చెప్పకూడదన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. అపరిచితుల చేతికి ఫోన్లు ఇవ్వరాదని, దీనివల్ల సైబర్ నేరగాళ్ల మోసాలకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు.

కబ్జా చేసి ప్రభుత్వ భూమిలో వెంచర్!

- ఆ వెంచర్‌కు దారి కోసం మరొకరి భూ ఆక్రమణ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు


మాట్లాడుతున్న రైతు నగముంతల రవి

రేణిగుంట: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి వెంచర్ వేయడమే కాకుండా తన భూమిలో ఆ వెంచర్‌కు దారి వేసి ఆక్రమణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు నగముంతల రవి కోరారు. రేణిగుంట లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణాపురం లెక్క దాఖలాలోని 308/8లో 3.30 ఎకరాల భూమి 1930లో తన తాత నగముంతల చిన్నస్వామి పేరిట మీద రిజిస్టర్ అయ్యిందని, ఆ భూమిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో కొందరు కబ్జా చేసి వెంచర్ వేశారని, ఆ వెంచర్‌కి వెళ్లడానికి తమ భూమిని భూమిని కబ్జా చేసి దారి వేసుకున్నారని అన్నారు. దీనిపై అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులైనా స్పందించి ప్రభుత్వ భూమికి, తన భూమి ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశాడు.

పశువుల దాణా పంపిణీ

నాగలాపురం: పాడి రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పశువుల దాణా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతులు నష్ట పోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతులకు సబ్సిడీలో పశువుల దాణా పంపిణీ అందజేస్తోందన్నారు. కృష్ణాపురం గ్రామంలో బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస యాదవ్, సెల్వకుమార్, గోకుల్ నాయుడు, మణికంఠన్, పార్థిబన్, మురళి, విజయ్ పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, ఒంటరి మహిళలు, ప్రత్యేక ప్రతిభావంతులైన పాడి రైతులకు 50 శాతం సబ్సిడీలో పశువుల దాణా అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. సత్యవేడు మండల పరిధిలో పశువుల దాణా 325 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 50 కేజీల బస్తా రూ.1010 కాగా సబ్సిడీలో రూ.525కే ఇస్తున్నామన్నారు. ఏడీ గోవిందరాజు భాస్కర్, పశువైద్యాధికారి దయాకర్, ఏఓ మురళి, యుగంధర్‌రెడ్డి, చికెన్ చిన్నా(మురళి), బాలమురళీకృష్ణ, రమణయ్య, సుబ్రమణ్యం రాజు, లాయర్ రాజ, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం


మాట్లాడుతున్న సీఐ మంజునాథరెడ్డి

రేణిగుంట: మండలంలో కేఎల్ఎం హాస్పిటల్ ప్రాంతంలోని పీఎం హైస్కూల్ మైదానంలో శుక్రవారం ఫుట్‌బాల్ ఉచిత శిక్షణ శిబిరాన్ని సీఐ మంజునాథరెడ్డి ప్రారంభించారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో పిల్లలు, యువతకు ఈ శిబిరం నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. పిల్లలకు చిన్నతనం నుంచే ఆటలపై శిక్షణ ఇస్తే మంచి క్రీడాకారులుగా తయారవుతారన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ శిబిరాన్ని ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామన్నారు. లోకల్ పాస్టర్ లూథర్ బాబు, రెవరెండ్ సతీష్, రెవరెండ్ దీపక్, రెవరెండ్ నోవా, రెవరెండ్ విక్టర్, చైర్మన్ సతీష్ జయకర్ అతిథులుగా హాజరయ్యారు. పిల్లలకు క్రమశిక్షణతో పాటు శారీర ఉల్లాసం పెంపొందించేందుకరీ శిబిరం దోహదపడుతుందని, చుట్టుపక్కల గ్రామాల యువత ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమిటీ సభ్యులు శ్రీపతి, డాక్టర్ సుధాకర్, దయాకర్, నిఖిల్, బన్నీ, ప్రభుదాస్, విశ్రాంత సైనికుడు ఎం.రాజ్‌కుమార్, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఉమ పాల్గొన్నారు.


విద్యా సామగ్రితో విద్యార్థులు

విద్యా సామగ్రి పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామంలోని 100 మందికి పైగా విద్యార్థులకు శుక్రవారం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో చెన్నైకు చెందిన ఐసీఎస్ఏ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మోజస్ మనోహర్, అయన భార్య విమల విద్యాసామగ్రి, భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. పలువురు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఇద్దరు పేద విద్యార్థులకు రూ.30,000 ఆర్థిక సహాయం అందించారు. వీరికి మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ విజయ్‌కుమారి, దైవ సేవకులు రెవరెండ్ కుమార్, ఆశీర్వాదం, డేవిడ్, భాస్కర్, ఏసుపాదం, లాజర్, ఉపదేశకుడు లూక, వేలూరు విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత, గజవాహనంపై విహారం


వసంతోత్సవం: ఉభయ నాంచారులతో శ్రీవారు


గజవాహనంపై కల్యాణ వెంకటేశ్వుడు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం పెద్ద హనుమంతుడిపై శంఖు, చక్రధారిగా కల్యాణ వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేతునిగా వసంతోత్సవంలో పాల్గొన్న వెంకటేశ్వరుడు రాత్రి మోక్షప్రదాతగా గజ వాహనాన్ని అధిరోహించి గ్రామోత్సవంలో భక్తుల నుండి హారతులు అందుకున్నారు. వేకువ జామున 4 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజలు, నిర్మిత హోమశాలలో ప్రత్యేక హోమాలు చేశారు. ఏకాంతంగా కల్యాణ వెంకన్న, పద్మావతీ అమ్మవార్లకు శుక్రవార అభిషేకాలను, తొలి గంటతో దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. శంఖు, చక్రధారిగా శ్రీమహావిష్ణువు హనుమంత వాహనంపై కొలువుదీరారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రామ భక్తుడైన హనుమంతునిపై స్వామివారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగించారు. సాయంత్రం ఉభయ దేవరులతో శ్వేత వస్త్రాలు, సుగంధ పుష్ప మాలికలు, స్వర్ణాభరణాలు ధరించిన వెంకటేశ్వరుడు నవదంపతులను తలపిస్తూ వసంతోత్సవంలో పాల్గొన్నారు. మాడ వీధి వసంతోత్సవంలో స్వామి పరిచారకులు భక్తులపై సుగంధ తిరుచూర్ణ ద్రవ్యాలను చిలకరించారు. రాత్రి 7.30 గంటలకు గజవాహనంపై మోక్షప్రదాతగా చేత సుదర్శనధారుడై అధిష్టించిన స్వామివారు గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, ఏకాంత సేవను అర్చకులు నిర్వహించారు. శనివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు స్వామివారు దర్శనమివ్వనున్నారు.

వైఎస్ఆర్ సీపీ నేతకు పితృవియోగం


నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: వైఎస్ఆర్ సీపీ నేత బాబు తండ్రి సుబ్రమణ్యం(72) శుక్రవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్థానిక నాయకులతో కలిసి నాగలాపురం పడమటి హరిజన వాడలోని బాబు ఇంటికి చేరుకున్నారు. సుబ్రమణ్యం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు పార్టీ సీనియర్ నేతలు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, మోహన్ మొదలియార్, దానివేలు, రాజ, దేశప్పన్, ఈశ్వర్, రామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తత అవసరం


దాసుకుప్పంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

సత్యవేడు: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా లేకపోతే అది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. శుక్రవారం డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. డెంగీ జ్వరం ఉన్న గర్భవతుల నుంచి శిశువులకు సోకే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కిషోర్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, హెల్త్ అసిస్టెంట్ షణ్ముగం, మురళీమోహన్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు



ఇందిరానగర్‌లో ర్యాలీ

వరదయ్యపాళెం: దోమలతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో ఇందిరానగర్ లక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఆర్థో వైరస్ తరగతికి చెందిన 4 రకాల డెంగీ వైరస్‌లతో వ్యాధి వస్తుందని, వీటితో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్‌ఓ మధుసూదనరావు, శాంతి, జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి తన తండ్రి పక్షవాతం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వైద్యానికి సాయం చేయాలని జనసేన నాయకులను కోరింది. దీనిపై వారు స్పందించారు. పార్టీ తరపున రూ15వేలు, స్నేహితుల ద్వారా సేకరించిన రూ.16వేలను శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా సంకట హర చతుర్థి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయక స్వామి ఆలయం వద్ద శుక్రవారం ఆగమోక్తంగా సంకట హరచతుర్థి పూజలు చేశారు. ఈ పూజలను ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

19న కల్యాణోత్సవానికి తరలిరండి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 19వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక పద్మావతి సేవా మందిరంలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవానికి భక్తులు హాజరు కావాలని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో కల్యాణోత్సవానికి తరలిరావాలని ప్రచారం చేసి, పోస్టర్లు అతికించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

విద్యుత్ సమస్యలతో అవస్థలు

తొట్టంబేడు: మండలంలోని పొయ్య జగనన్న కాలనీ, రామానాయుడు ఎస్టీ కాలనీలో రెండు రోజులుగా విద్యుత్ సమస్యలతో గిరిపుత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మూడునెలల క్రితం కాలిపోయింది. మొక్కుబడిగా మరమ్మతులు చేయడం తప్పితే అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు. వేసవికాలం కావడంతో తరచూ విద్యుత్ అంతరాయంతో చిన్న పిల్లలు, వృద్ధులకు చాలా ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. అధికారులు స్పందించి మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు. మల్లిగుంటలో కూడా తరచూ ఇదే సమస్య తలెత్తుతోందని గ్రామస్తులు చెప్పారు. అయితే ట్రాన్స్‌కో అధికారులు మాత్రం సింగిల్ ఫేజ్ మోటార్లు ఎక్కువగా ఉండటం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్టు పేర్కొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు విద్యాసాగర్, మురళీధర్‌రెడ్డి, ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా జ్వరాలపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జ్వరాల బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు.

కుక్కను తప్పించబోయి..!


ప్రమాదానికి గురైన కారు

నారాయణవనం: మండల కేంద్రం బైపాస్‌లోని జాతీయ రహదారిపై అదుపు తప్పిన కారు 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. విద్యుత్ ట్రిప్ కావడంతో పెనుప్రమాదం తప్పింది. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అదృష్టవశాత్తు ప్రయాణికులెవరూ గాయపడలేదు. స్థానికుల కథనం.. తిరుమల నుంచి చెన్నైకి చెందిన రఘు కుటుంబ సభ్యులు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు నారాయణవనం బైపాస్‌లో అరుణానది బ్రిడ్జిని దాటాక రహదారికి అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించపోయి రఘు కారును కుడి వైపునకు నడిపాడు. దీంతో రహదారికి పక్కనే ఉన్న చికెన్ షాపు అరుగును ఢీకొట్టి పక్కనే 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. దీంతో అరుగు ధ్వంసమైంది. విద్యుత్ స్తంభం విరిగి ఒరిగిపోయింది. చికెన్ షాపు మూసి ఉండడంతో ప్రమాదం తప్పింది. ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్, ఎల్ఐ ప్రభాకర్ మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పాఠశాలల పరిరక్షణకు మళ్లీ ఉద్యమిస్తాం

- తెలుగు మాధ్యమాన్ని కొనసాగించుకుందాం
- స్కూళ్ల మూసివేతకు కారణమవుతున్న ప్రభుత్వ అసంబద్ధ విధానాలు
- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ విమర్శ



మాట్లాడుతున్న మురళీకృష్ణ

శ్రీకాళహస్తి: పాఠశాలల పరిరక్షణకు, తెలుగు మాధ్యమాన్ని కొనసాగించుకోవడానికి ఉద్యమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ స్కూళ్ల పేరిట క్రమంగా పాఠశాలలు మూతపడుతున్నాయని, ప్రభుత్వం ఉత్తర్వులే దీనికి కారణమని మండిపడ్డారు. ఇప్పటికే ప్రభుత్వ అసంబద్ధ విధానాలపై మూడు దశల్లో పోరాటాలు చేశామన్నారు. అయినా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళుతున్న కారణంగా ఉద్యమాన్ని మరో రూపంలో కొనసాగించాలని రాష్ట్ర సంఘం నిర్ణయించిందన్నారు. జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు 16, 17వ తేదీలలో డిమాండ్లను తెలిపే లేఖను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌కు మెయిల్, వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. 18 19వ తేదీలలో డిమాండ్ల లేఖను ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులకు, జిల్లా పరిషత్ అధ్యక్షులకు, మున్సిపల్ చైర్మన్‌లకు, ఎంపీటీసీలకు, సర్పంచులకు, పాఠశాల కమిటీ అధ్యక్షులకు ఇవ్వాలన్నారు. పాఠశాలలను పరిరక్షించుకునే ఉద్యమంలో జిల్లాలోని ఏపీటీఎఫ్ అన్ని మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు ఉపాధ్యాయులందరినీ ఉద్యమంలో భాగస్వాముల్ని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కే.వెంకటాద్రి, జిల్లా బాధ్యులు ఏ. వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌కే. చెంచురాజు తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


ప్రత్యేక తరగతి పరిశీలిస్తున్న ఎంఈఓ-2

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సప్లమెంటరీ విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు, ఫెయిలైన సబ్జెక్టును ఉపాధ్యాయులు దగ్గరుండి చదివిస్తున్నారని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలో అందరూ పాస్ అయ్యేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.